క్లుప్తంగా...

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన



కుందన్‌పల్లిలో సీసీ రోడ్‌కు శంకుస్థాపన చేసిన చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత

కీసర: దమ్మాయిగూడ మున్సిపల్ పరిధిలోని ఎస్‌ఎంహెచ్ కుటీర్ కుందన్‌పల్లిలో సీసీ రోడ్డు పనులకు చైర్‌పర్సన్ వసుపతి ప్రణీత శ్రీకాంత్ గౌడ్ సోమవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. 6వ వార్డులో చేపట్టిన సీసీ రోడ్డు పనులకు రూ.8 లక్షల నిధులు కేటాయించామన్నారు. కార్యక్రమంలో కమిషనర్ ఎ.స్వామి, డీఈఈ చిరంజీవులు, స్థానిక వార్డు కౌన్సిలర్ వరగంటి వెంకటేశ్, కాలనీ అధ్యక్షుడు ఉదయ్‌రెడ్డి, కాలనీవాసులు పాల్గొన్నారు.

స్కూల్ విద్యార్థులకు బస్‌పాస్‌ల అందజేత



కీసర: మండల పరిధిలోని గ్రామాల నుంచి కీసరలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు వచ్చే 100 మంది విద్యార్థులకు సర్పంచ్ నాయకపు మాధురి ఆధ్వర్యంలో బస్‌పాస్‌లను సోమవారం అందజేశారు. శ్రీసీతారామాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ నాయకపు వెంకటేశ్ సౌజన్యంతో బస్‌పాస్‌లు ఇచ్చారు. కుషాయిగూడ డిపో మేనేజర్ చంద్రకాంత్, బస్ విలేజ్ ఆఫీసర్ చినింగని ఆనంద్, ఉప సర్పంచ్ తటాకం లక్ష్మణ్ కుమార్‌శర్మ, గ్రామ నాయకులు శీలం మల్లేష్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణదారులపై కఠిన చర్యలు




జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో అక్రమ నిర్మాణాలను సోమవారం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ ఆధ్వర్యంలో సిబ్బందితో కలిసి కూల్చివేశారు. ఈ సందర్భంగా రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. రెవెన్యూ సహాయకులు నాగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రిక్ వాహనాలపై సాధికారిక నైపుణ్యం అవసరం



కీసర: ఎలక్ట్రిక్ వాహనాల తయారీ, భద్రతలపై సాధికారిక నైపుణ్యాలు ఎంతో అవసరమని ఆటోమోటివ్ అండ్ ఎలక్ట్రిక్ వాహనాలు డైరెక్టర్ గోపాలకృష్ణన్ హితవు పలికారు. గీతాంజలి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీలో ఎన్‌పీటీసీ గ్రూప్ ఆఫ్ కాలేజెస్ వేల్స్, యూకేలోని లాండ్రిల మెన్‌ఐ కాలేజీలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఎలక్ట్రిక్ వాహనాలపై సాధికారిక నైపుణ్య శిక్షణ శిబిరాన్ని ముఖ్య అతిథిగా పాల్గొని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ వాహనాల పాలసీని ప్రవేశ పెట్టినప్పటి నుంచి ఎలక్ట్రిక్ వాహనాల తయారీకి రూ.15 వేల కోట్ల పెట్టుబడులను ఆకర్షించిందన్నారు. కార్యక్రమానికి టీహబ్‌లోని రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ సహకరించగా, వేల్స్ ప్రభుత్వం నిధులు సమకూర్చిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఉదయ్‌కుమార్ సుపర్ల చెప్పారు.

విద్యకు పెద్దపీట వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం



జవహర్‌నగర్: రాష్ట్రం ఏర్పడిన తర్వాత ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తోందని మేయర్ మేకల కావ్య అన్నారు. సోమవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని జవహర్‌నగర్, బాలాజీనగర్ ప్రభుత్వ పాఠశాలలకు విద్యార్థులకు మేయర్ మేకల కావ్య, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వంలోనే ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ సంతరించుకుందన్నారు. మన ఊరు - మన బడితో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా విద్యను అందిస్తోందన్నారు. పాఠశాలల్లో డిజిటల్ క్లాసుల ఏర్పాటుతో విద్యార్థులు చదువుల్లో మరింత రాణిస్తున్నారన్నారు. అనంతరం జవహర్‌నగర్‌లో కుట్టుమిషన్ శిక్షణ కేంద్రాన్ని మేయర్ మేకల కావ్య పరిశీలించారు. కార్పొరేటర్ రాంచందర్, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శేఖరయ్య, బీఆర్‌ఎస్ నాయకులు మతిన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతు వేదిక నిధులెక్కడ..?

- నిర్మించారు.. నిర్వహణ మరిచారు..
- ఒక్కో వేదికకు ప్రతినెలా రూ.9 వేలు
- 10 నెలలుగా అందని నిర్వహణ బకాయిలు
- ఇబ్బందుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులు



సాక్షి, మేడ్చల్ జిల్లా: వ్యవసాయ శాఖ సేవలు అన్నదాతలకు మరింత చేరువయ్యేందుకు ప్రభుత్వం క్లస్టర్ల వారీగా రైతు వేదికలు నిర్మించింది. సాగులో సలహాలు, సూచనలు వీటి ద్వారా అధికారులు అందిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ రైతు వేదికల నిర్వహణపై ఉన్నతాధికారులకు పట్టింపు లేకుండా పోయిందనే వాదనలు వినిపిస్తున్నాయి. గత్యంతరం లేని పరిస్థితుల్లో వ్యవసాయ విస్తరణ అధికారులే సొంత డబ్బులు ఖర్చు చేయాల్సి వస్తోంది. నెలలు తరబడి రైతు వేదికల నిర్వహణ భారంగా మారుతోందని ఏఈఓలు వాపోతున్నారు.

శివారు జిల్లాల్లో..

జిల్లాలో 9 రైతు వేదికలు ఉన్నాయి. వీటి నిర్వహణ బకాయిలు రూ.8,10,000 పేరుకుపోయాయి. ఒక్కో రైతు వేదికకు ప్రతినెలా రూ.9 వేలు అందజేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. 2022 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు 5 నెలలకు ఒక్కో రైతు వేదికకు రూ.45 వేలు అందించింది. ఆ తర్వాత నుంచి గడిచిన 10 నెలల నిర్వహణ నిధులు మంజూరు కాలేదు. ఒక్కో రైతు వేదికకు రూ.90 వేల బకాయిలు పేరుకుపోయాయి.

రైతు వేదిక నిర్వహణ ఖర్చు ఇలా..

రైతు వేదికల నిర్వహణ కోసం ఒక్కో రైతు వేదికకు నెలకు రూ.9 వేలను ప్రభుత్వం అందిస్తోంది. ప్రతి నెలా ప్రభుత్వం అందిస్తున్న రూ.9 వేలకు సంబంధించి తాగునీటి కోసం రూ.500, మరమ్మతులు, ఇతర ఖర్చులకు రూ.వెయ్యి, విద్యుత్తు ఛార్జీలకు రూ.వెయ్యి, స్టేషనరీ, జిరాక్స్ రూ.వెయ్యి, పరిశుభ్రత, కాపలాదారుడికి రూ.3 వేలు, రైతులకు శిక్షణ కార్యక్రమాలకు రూ.2,500లను ఖర్చు చేయాల్సి ఉంది.

రైతు వేదికలకు అందుబాటులో ఏఈఓలు

రైతు వేదికల్లో వ్యవసాయ విస్తరణాధికారులు(ఏఈఓలు) అందుబాటులో ఉంటారు. అన్నదాతలకు వ్యవసాయ సంబంధిత సలహాలు, సూచనలు అందిస్తారు. అవగాహన సమావేశాలు, శిక్షణ కార్యక్రమాల సమయంలో కూర్చొనేందుకు కుర్చీలు, మైక్‌సెట్ వంటి సామగ్రిని ప్రభుత్వం సమకూర్చించింది. ఇతర ప్రజోపయోగ కార్యక్రమాలు, వివిధ శాఖల సమావేశాలకు వీటిని వినియోగించుకునేందుకు అవకాశం కల్పించింది. అయితే రైతు వేదికల నిర్వహణకు 10 నెలలుగా నిధులు మంజూరు చేయకపోవడంతో ఏఈఓలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు సత్వరమే స్పందించి బకాయిల చెల్లింపులు.. నిధులు మంజూరు పై దృష్టి సారించాలని రైతులు కోరుతున్నారు.

ఓటు విలువ తెలుసుకోవాలి

అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రతి ఒక్కరూ ఓటు విలువ తెలుసుకోవడంతో పాటు దానిపై అవగాహన పెంచుకోవడం ఎంతో అవసరమని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డి తెలిపారు. ఎన్నికల కమిషన్ సూచనల మేరకు ఓటు హక్కుపై చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రం(ఈవీఎమ్)లో ఓటు ఎలా వేయాలి..? వేసిన ఓటు చెల్లిందా? లేదా అనే సమాచారంతో పాటు తాము వేసిన వారికే ఓటు వెళ్లిందా.. లేదా అనే విషయాన్ని పరిశీలించుకోవచ్చని అన్నారు. కలెక్టరేట్‌లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన సెల్ ద్వారా ఇక్కడకు వచ్చే ప్రతి ఓటరు అవగాహనకు సంబంధించి ఈవీఎంలో డెమో కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూఅధికారి చంద్రావతి, కలెక్టరేట్ ఏవో వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా



సాక్షి, మేడ్చల్ జిల్లా: మహిళా, శిశు సంక్షేమ శాఖ బడ్జెట్‌ను పెంచడంతో పాటు అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలకు ప్రభుత్వం ప్రకటించిన కనీస వేతన చట్టాన్ని అమలు పర్చాలని అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు ఉన్ని కృష్ణన్ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ టీచర్లు, కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలకు పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయడంతోపాటు ఉద్యోగ భద్రత కల్పించాలని ఆయన కోరారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాడ్యూటీ వెంటనే చెల్లించాలన్నారు. ఎలాంటి కండిషన్లు లేకుండా మినీ అంగన్‌వాడీ టీచర్లను మెయిన్ టీచర్‌గా నియమించాలన్నారు. ధర్నాలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి శోభారాణి, నాయకురాళ్లు బాలమణి, అంజమ్మ, రమా, శివరాణి, భాగ్య, శైలజ, రేణుక పాల్గొన్నారు. ధర్నా అనంతరం జిల్లా అదనపు కలెక్టర్ నర్సింహారెడ్డితో సహా సంబంధిత శాఖ అధికారికి వారు సమస్యలతోకూడిన వినతి పత్రాన్ని అందజేశారు.

అందరి సాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేద్దాం



కాచవానిసింగారంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి మల్లారెడ్డి, జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

మంత్రి మల్లారెడ్డి

ఘట్‌కేసర్: అందరి సాయంతో గ్రామాన్ని అభివృద్ధి చేద్దామని మంత్రి మల్లారెడ్డి అన్నారు. సోమవారం కాచవానిసింగారంలో రూ.1.5 కోట్ల నిధులతో పలు అభివృద్ధి పనులకు జెడ్పీ చైర్మన్ శరత్‌చంద్రారెడ్డి, ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ జంగమ్మతో కలిసి మంత్రి భూమిపూజ, శంకుస్థాపనలు చేశారు. కాచవానిసింగారంలో మంత్రి పర్యటనలో మంత్రికి చేదు అనుభవం ఎదురైంది. గ్రామంలో బీసీ కమ్యూనిటీ హాల్ కూల్చివేసి తిరిగి నిర్మిస్తామని హామీనిచ్చి రోడ్డు నిర్మిస్తున్నారని స్థానికులు మంత్రిని నిలదీశారు. మాకు కమ్యూనిటీ హాల్, మహిళా భవనం కావాలని మహిళలు, యువకులు శంకుస్థాపనను అడ్డుకున్నారు. వెంటనే పోలీసులు వారిని పక్కకు తప్పించారు. స్థానికులు మంత్రి మల్లారెడ్డి డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేయగా బీఆర్‌ఎస్ జిందాబాద్, మల్లన్న జిందాబాద్ అంటూ బీఆర్‌ఎస్ నాయకులు నినాదాలు చేశారు. మేడిపల్లి పోలీసులు బీజేపీ నాయకులు బస్వరాజ్, ప్రభంజన్‌ను అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. బీఆర్‌ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి భద్రారెడ్డి, సర్పంచులు వెంకటేశ్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, శివశంకర్, ఉప సర్పంచ్ గీత, రైతుబంధు మండల కో ఆర్డినేటర్ అంజిరెడ్డి, వార్డు సభ్యులు సుదర్శన్, విష్ణుగౌడ్, శ్యామ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్ష ప్రధాన కార్యదర్శి రమేశ్, కొండల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్, రైతుబంధు జిల్లా సభ్యులు భిక్షపతిగౌడ్, మంకయ్య పాల్గొన్నారు.

రైల్వే వంతెన పనులపై మంత్రిని విమర్శించడం సరికాదు



టెండర్ ప్రతిని ప్రదర్శిస్తున్న శ్రీనివాస్‌గౌడ్, పావనీయాదవ్, మాధవరెడ్డి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ రైల్వే వంతెన పనులపై మంత్రి మల్లారెడ్డి, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులను విమర్శించడం సరికాదని బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్, మున్సిపల్ చైర్ పర్సన్, వైస్ చైర్మన్ పావనీయాదవ్, మాధవరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. వంతెన పనులు 2007లో ప్రారంభమయ్యాయని, అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం పిడికెడు మట్టి తీయలేదన్నారు. సర్పంచ్‌గా ఉన్న సమయంలో యాదగిరి యాదవ్ వంతెన కోసం ఏమి చేశాడని ప్రశ్నించారు. రైల్వే వంతెనపై సమావేశం నిర్వహించి చాలామంది రాజీనామా చేశారనడం అవాస్తవమని, రాజీనామా చేయలేదని చాలామంది ప్రకటించారన్నారు. వంతెన ఆవల ఉన్న వారి ఓట్లు అవసరం లేదని మంత్రి అనలేదని, కావాలనే బాధితులకు కోర్టులో కేసు వేయించారని ఆరోపించారు. కాంట్రాక్టర్ పనులు చేయకపోవడంతో మంత్రి రీటెండర్ వేయించారని, ఈ నెల 21 టెండర్ తెరవగానే పనులు ప్రారంభిస్తారన్నారు. కౌన్సిలర్లు రమాదేవి, అనురాధా, ఆంజనేయులుగౌడ్, మల్లేశ్, జహంగీర్, బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుధాకర్‌రెడ్డి, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

అమెజాన్ ఆధ్వర్యంలో ప్రైమ్ డే

సాక్షి, సిటీబ్యూరో: ప్రముఖ ఓటీటీ ప్లాట్‌ఫామ్ అమెజాన్ ఆధ్వర్యంలో ప్రైమ్ డే వేడుకలు నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా ప్రైమ్ డే ఫైర్ టీవీ స్టిక్ లైట్, ఫైర్ టీవీ స్టిక్ 4కె మ్యాక్స్ తదితర పరికరాల కలెక్షన్‌ను అందిస్తున్నారు. ఈ నెల 15 నుంచి ఒకరోజు పాటు జరిగే ఈ ప్రైమ్ డే వేడుకల సందర్భంగా వినియోగదారులు ప్రైమ్ పరికరాలను అత్యధిక రాయితీలతో అందుకోవచ్చని సంస్థ ప్రతినిధులు తెలిపారు. ప్రైమ్ వీడియో, నెట్‌ఫ్లిక్స్, డిస్నీ+ హాట్‌స్టార్, జీ5, జియో తదితర 12వేలపైగా యాప్‌ల ద్వారా ఫైర్ టీవీ వినియోగదారులు మిలియన్‌పైగా సినిమాలు, టీవీ షోలు వీక్షించవచ్చన్నారు.

జీవో 59 కాలపరిమితిని తొలగించాలి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని జీవో–59 దరఖాస్తుదారులకు అధిక రేటు నిర్ణయించి రూ.లక్షల డిమాండ్ నోటీసులు పంపించి వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్న రెవెన్యూ అధికారుల చర్యలపై సోమవారం జవహర్‌నగర్ బీజేపీ అధ్యక్షుడు రంగుల శంకర్ నేత ఆధ్వర్యంలో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అడిషనల్ కలెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డిని కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. 2014లోని జీవో–59 ప్రకారం ఇంటి స్థలం విలువ గజానికి రూ.1,800 తీసుకోవాలని, జీవో–59 అమలుకు విధించిన కాలపరిమితిని తొలగించాలని డిమాండ్ చేశారు. లేనిచో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామన్నారు. అదేవిధంగా జవహర్‌నగర్ ప్రధాన రహదారి పనుల అవకతవకలు, డివైడర్, సరైన ఫుట్‌పాత్ లేకపోవడం, డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం, నాణ్యత లోపాలపై చర్యలు తీసుకోవాలని, ప్రధాన రహదారి పనులు పూర్తి చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు కమల్, సునీల్, మల్లేష్‌గౌడ్, మహేశ్వరిగౌడ్, సుజాత, మహేష్‌గౌడ్, లక్ష్మీరెడ్డి, స్వర్ణలత, యాదగిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై అవగాహన

కీసర: నాగారం మున్సిపాలిటీలో పరిధిలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో సీపీఆర్‌పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. గుండెనొప్పి వచ్చినప్పుడు ప్రథమ చికిత్సగా సీపీఆర్ నిర్వహించాలని వైద్యులు చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా చైర్మన్ చంద్రారెడ్డి, వైస్ చైర్మన్ మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

ఆర్నెళ్లయినా చర్యలు లేవు.. కలెక్టర్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: ఎదులాబాద్ పంచాయతీలో జరిగిన అవకతవకలపై ఫిర్యాదు చేసి ఆర్నెళ్లయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆ గ్రామపంచాయతీ సభ్యులు సోమవారం కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పంచాయతీలో జరిగిన అవినీతి, అక్రమాలపై సాక్ష్యాలతో సర్పంచ్ సురేశ్, అప్పటి కార్యదర్శి ఉషా, బిల్ కలెక్టర్ రజనీకర్‌రెడ్డిపై జనవరి 12న అదనపు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ఇంటి పన్ను చెల్లించాలని వార్డు సభ్యులంతా చెప్పినా ఎవరూ చెల్లించడం లేదని, పంచాయతీ వ్యవస్థపై నమ్మకం లేకుండా పోయిందన్నారు. అక్రమాలపై చర్యలు తీసుకొని గ్రామాభివృద్ధికి సహకరించాలని వార్డు సభ్యులు శ్రీనివాస్, ఆంజనేయులు, గణేశ్ ఫిర్యాదు చేశారు.

కుమ్మరికుంట కబ్జాపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

ఘట్‌కేసర్: కొర్రెముల్ రెవెన్యూ పరిధి వెంకటాపూర్ గ్రామంలోని కుమ్మరికుంట భూమిని కబ్జా చేయడమే కాకుండా ప్రశ్నించిన వారిని బెదిరిస్తున్నారని వెంకటాపూర్ ఉప సర్పంచ్ సత్యానారాయణగౌడ్ సోమవారం తహసీల్దార్ విజయలక్ష్మికి ఫిర్యాదు చేశాడు. సర్వే నంబర్ 475లోని భూమిని కబ్జా చేసిన వారిపై, బఫర్ జోన్‌లో హెచ్‌ఎండీఏ వెంచర్ చేసిన వారిపై విచారణ జరిపి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తహసీల్దార్‌కు ఇచ్చిన లేఖలో పేర్కొన్నారు.

ఎస్‌ఎఫ్‌ఐ బంద్ విజయవంతం చేయాలి



మేడ్చల్‌లో ఎస్‌ఎఫ్‌ఐ ర్యాలీ

మేడ్చల్: విద్యారంగ సమస్యలపై పోరాటంలో భాగంగా ఈ నెల 12వ తేదీన ఎస్‌ఎఫ్‌ఐ నిర్వహిస్తున్న విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ కోరారు. మేడ్చల్‌లో బంద్‌ను విజయవంతం చేయాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఎఫ్‌ఐ మేడ్చల్ జిల్లాలో విద్యారంగ సమస్యలపై పోరాటం చేసేందుకు జిల్లా విద్యాసంస్థల బంద్‌ను చేపట్టిందని దాన్ని విజయవంతం చేయాలని కోరారు. ర్యాలీలో కిరణ యశ్వంత్, శివ తదితర ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు, వివిధ విద్యాసంస్థల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బహిరంగసభ కరపత్రం ఆవిష్కరణ



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న అఖిలపక్ష నాయకులు

ఘట్‌కేసర్: పట్టణంలో నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల అలసత్వంపై పట్టణంలోని ఆర్యవైశ్య ఫంక్షన్ హాల్‌లో బుధవారం అఖిలపక్షం, కుల సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన బహిరంగ సభ వాల్ పోస్టర్‌ను బంధన్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం ఆవిష్కరించారు. ముఖ్యఅతిథిగా టీపీసీసీ సీనియర్ అధికార ప్రతినిధి హరివర్ధన్‌రెడ్డి, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, సర్పంచ్ గోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్, టీజేఎస్ నాయకుడు లక్ష్మారెడ్డి, బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు హనుమాన్, సీపీఎం జిల్లా నాయకుడు యాదయ్య, సీపీఐ నేత జయచంద్ర హాజరై కరపత్రాన్ని ఆవిష్కరించారు.

ఘనంగా ఫలహార బండ్ల ఊరేగింపు



అత్వెల్లిలో ఫలహారబండి ఊరేగింపులో మంత్రి మల్లారెడ్డి

మేడ్చల్: బోనాల ఉత్సవాల్లో భాగంగా గ్రామాల్లో ఫలహార బండ్ల ఊరేగింపు, తొట్టెల సమర్పణ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. అత్వెల్లిలో నక్షత్ర యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫలహార బండి ఊరేగింపును మంత్రి మల్లారెడ్డి పూజలు నిర్వహించి ప్రారంభించారు. గ్రామంలోని దుర్గమ్మ, పోచమ్మ దేవాలయాల్లో పూజలు చేసి అమ్మవార్లను దర్శించుకున్నారు. రాజబొల్లారం తండాలో గిరిజనులు నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో ఆయన పాల్గొని పూజలు చేశారు. కౌన్సిలర్లు మానస శ్రవన్ కుమార్ గుప్తా, సరితా మల్లేష్‌గౌడ్, దేవరాజు, నాయకులు ఈశ్వరయ్య, రవికుమార్, సర్పంచ్ మాంగ్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.



రాజబొల్లారం తండాలో..

పేద ప్రజలను మోసం చేస్తున్న మంత్రి మల్లారెడ్డి

కూరగాయల మార్కెట్ ప్లాట్ల బాధితుల నిరసన



జవహర్‌నగర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న బాధితులు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ సర్వే నెంబర్–613, 614లో కేసీఆర్ కూరగాయల మార్కెట్ పేరుతో తమ ప్లాట్లను లాక్కున్నారని, తమకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చిన మంత్రి మల్లారెడ్డి తమను మోసం చేశారని ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు బాధితులు సోమవారం ప్లకార్డులతో జవహర్‌నగర్ అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. రూ.లక్షల పెట్టి ప్లాట్లను కొనుగోలు చేశామని, ఆ ప్లాట్లలో మంత్రి మల్లారెడ్డి మార్కెట్ ఏర్పాటు చేసి 62 మంది కుటుంబాలను రోడ్డుపాలు చేశారని, ఇందుకు పూర్తి బాధ్యత మంత్రి మల్లారెడ్డి వహించాలని, లేనిపక్షంలో మంత్రి ఇంటిని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలేరు రమేష్, నర్సింహయాదవ్, శ్రీనివాస్ రెడ్డి, ఆనంద్, రాజుయాదవ్, పలువురు బాధిత మహిళలు తదితరులు ఉన్నారు.

స్వామి వివేకానందను ఆదర్శంగా తీసుకోవాలి

మదర్‌థెరిసా ఫార్మసీ కళాశాల చైర్మన్ ఫణీప్రసాద్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న చైర్మన్ ఫణీప్రసాద్

ఘట్‌కేసర్: స్వామి వివేకానంద స్ఫూర్తితో విద్యార్థులు లక్ష్యాన్ని ఏర్పర్చుకొని పట్టుదలతో విజయం సాధించడానికి కృషి చేయాలని మదర్ థెరిసా ఫార్మసీ కళాశాల చైర్మన్ ఫణీప్రసాద్ అన్నారు. సోమవారం ఎన్‌ఎఫ్‌సీ నగర్ మదర్ థెరీసా ఫార్మసీ కళాశాల వార్షికోత్సవం, చివరి సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ బంగారు భవిష్యత్‌కు విద్యార్థి దశలోనే బీజం నాటాలని, మదర్ థెరీసా ఫార్మసీ కళాశాలలో చదివిన విద్యార్థులు ప్రఖ్యాత ఫార్మా కంపెనీల్లో పనిచేయడం గర్వకారణంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కళాశాల కార్యదర్శులు మల్లాది రమాకాంత్‌రెడ్డి, సోమశేఖర్, ప్రిన్సిపల్ కిరణ్‌కుమార్, వైస్ ప్రనిపిన్సిపల్ రాంచందర్, కార్యక్రమం కన్వీనర్, హెచ్‌ఓడీ రాజ్‌కుమార్, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

సైబర్ మోసాల నియంత్రణకు 'బ్లాక్ చెయిన్'



వర్క్‌షాప్‌లో ప్రసంగిస్తున్న జేఎన్‌టీయూహెచ్ రెక్టార్ గోవర్ధన్

మేడ్చల్‌రూరల్: సైబర్ మోసాలు, హ్యాకింగ్‌ను నిరోధించేందుకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఎంతో దోహదపడుతుందని జేఎన్‌టీయూహెచ్ రెక్టర్ గోవర్ధన్ తెలిపారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో బ్లాక్ చెయిన్ టెక్నాలజీపై సోసైటల్ అప్లికేషన్స్ ఆఫ్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ అండ్ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ అనే అంశంపై ఎస్‌ఈఆర్‌బీ సహకారంతో నిర్వహిస్తున్న వారం రోజుల వర్క్‌షాప్‌ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ ఒక రకమైన డిజిటల్ లెడ్జర్ టెక్నాలజీ అని ఇది సిస్టమ్‌ను మార్చడం, హ్యాక్ చేయడం, సైబర్ ఫ్రాడ్స్ వంటి వాటిని నిరోధిస్తుందన్నారు. బ్యాంక్ లావాదేవీలు మరింత సురక్షితంగా ఉంటాయని తెలిపారు. జేఎన్‌టీయూహెచ్ ఎస్డిసి డైరెక్టర్ శోభ బిందు, వర్క్‌షాప్‌లో కళాశాల చైర్మన్ నర్సింహరెడ్డి, సెక్రటరి త్రిశూల్‌రెడ్డి, కోశాధికారి త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, ప్రిన్సిపాల్ లోకనాథం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.